

రాజకీయ ఉద్దండుల కోట కొత్తపేట

- 6లో



నువ్వు కావాలయ్యా.. నువ్వు రావాలయ్యా : కాకినాడ రూరల్‌లో పవన్ రోడ్ షో



రాత్రయినా తరగని అభిమానం : సామర్లకోటలో సభకు హాజరైన జనం

సమస్యలివే సార్ : పవన్‌తో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణమూర్తి

మా గుండెల నిండా నువ్వే పవనన్నా...

కాకినాడ రూరల్ రోడ్ షోలో పవన్ అభివాదం



అభిమాన పవనాలు : కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో సభకు హాజరైన జనం



కూటమికే ఓటేయండి : అభ్యర్థులు పంతం నానాజీ, ఉదయ్ శ్రీనివాస్‌లతో కలిసి పవన్ అభివాదం





తమ్మవరం రైతులకు జగన్ మోసంపై సభలో ఫ్లెక్సీ

గుర్తు పెట్టుకోండి.. మరచిపోవద్దు : పెద్దాపురంలో పవన్‌తో కలిసి గుర్తులను చూపుతున్న అభ్యర్థులు ఉదయ్‌శ్రీనివాస్, నిమ్మకాయల చినరాజప్ప

జన కెరటం..

- పవన్ వారాహియాత్రకు జన సునామీ
- కాకినాడ రూరల్, సామర్లకోటల్లో సభలు
- వైసీపీ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- కూటమిని గెలిపించాలని విన్నపం
- బాధితులకు న్యాయం చేస్తామని హామీ

సర్పవరం జంక్షన్/కాకినాడ రూరల్/పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 27: 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన అంతం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం సొంత పార్టీ ప్రయోజనాలనే పణంగా పెట్టి, అనుభవం ఉన్న చంద్రబాబుకు మద్దతు ఇచ్చినవాడిని.. ఏ ఒక్క కులాలకో పరిమితం కాను. అన్ని కులాల ప్రయోజనాల కోసం పాటుపడతా. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి గెలిపించాలి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోరారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం ముసలమ్మతల్లి ఆలయం వద్ద కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ)ఆధ్వర్యంలో శనివారం రాత్రి వారాహి యాత్ర నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలపై తీవ్ర విమర్శలు చేశారు. డొక్కు స్కూటర్‌తో సమాచారం కావాలంటే మా ఇంటికి వచ్చే కన్నబాబు అక్రమాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడి రూ.వెయ్యి కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆస్తి తగాదా పేరు చెప్పి యువ డాక్టర్ ఆత్మహత్యకు కారణమైన దుర్మార్గుడు అని ఆరోపించారు.వాకలపూడిలో 20 మందికి చెందిన 4.86 ఎకరాల భూమిని కడప జిల్లాకు చెందిన రెడ్లు కొట్టేయడంలో సహకరించారన్నారు.తమ్మవరం రైతుల నుంచి ఏపీఐఐసీ సేకరించిన 298 ఎకరాల భూమిని వెనక్కి ఇప్పిస్తానని హామీ ఇచ్చి సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు రైతులను మోసగించారన్నారు. కన్నబాబు కమిషన్లు తీసుకుంటూ దందాలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం కమీషన్ కోసం కొంగోడు బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకున్న ఘనుడన్నారు. సూర్యారావుపేటలో మత్స్యకారుల ఇళ్లను ఖాళీ చేయించి తిరిగి స్థలాలివ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్ర మాలు మర్చిపోలేదన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, యువత భవిష్యత్తు కోసం గాజుగ్లాసు గుర్తులపై రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీకి చెందిన సీనియర్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను పవన్ ప్రశంసించారు.సభలో ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు,కె.బాబీ, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ బొండా సూర్యారావు, కాకరపల్లి చలపతి, రాందేవు సీతయ్యదొర, పెంకే శ్రీనివాస్‌బాబా పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలన.. ఆరు పరిశ్రమల మూత

శత సంవత్సరాల చరిత్ర గల సామర్లకోట డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీ, సగ్గుబియ్యం పరిశ్రమ, నాలుగు సహకార చక్కెర కర్మాగారాలు ఐదేళ్ల వైసీపీ పాలనలోనే మూతపడ్డాయని పవన్ కల్యాణ్ అన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పట్టణ రింగ్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజానగరం నుంచి కాకినాడ వరకూ ఉన్న ఏడీబీ రోడ్డులో స్వయంగా ప్రయాణించి ప్రజల కష్టాలు తెలుసుకున్నానన్నారు.రానున్న కూటమి ప్రభుత్వంలో రోడ్లను అభివృద్ధి చేసే బాధ్యతను జనసేన తరఫున తాను స్వీకరిస్తానన్నారు. స్థానికంగా 100 పడకల ఆస్పత్రిని నిర్మించి మెరుగైన వైద్యం అందిస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు కలిసి 600 ఎకరాల రామేశం మెట్టను పూర్తిగా నేలమట్టం చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ప్రతి వైసీపీ నాయకుడిని రామేశంమెట్టలో మోకాలిపై నడిపిస్తామంటూ హెచ్చరించారు.పెద్దాపురం నియోజకవర్గంలో 55 ఎకరాల్లో 20,040 మందికి స్థలాలిస్తే వాటిలో 1,019 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు గోదావరి జలాలను అందిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఎస్సీలు తమ పథకాలను ఎందుకు నిలిపివేశారో నిలదీయాలన్నారు. ఎమ్మెల్సీ దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేస్తే దళితులు ఎందుకు వైసీపీకి ఓటు వేయాలి అని సునీల్‌ను ప్రశ్నించారు. ఓటమి పొందే పార్టీలోకి మారడం సునీల్ నైజమన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం..

కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తా. కాకినాడ పోర్టును అభివృద్ధి చేస్తా. ఏడీబీ రహదారిని గుంతలమయంగా మార్చేసిన ఘనత వైసీపీదే. ఫుడ్ పార్కును గాలికొదిలేశారు. ఏ ఒక్క పరిశ్రమా రాలేదు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా.

ఇళ్ల పట్టాల పేరుతో పేదలకు మోసం

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో నకిలీ ఇళ్లపట్టాలిచ్చారు. స్వామినగర్‌లోఇళ్లపట్టాల పేరుతో పేదలను మోసగించారు. జయలక్ష్మి సహకార సొసైటీ స్కామ్‌లో వైసీపీ నాయకుల పాత్ర ఉంది. రూరల్‌లోని గ్రామాల్లో వైద్యం మీద ప్రత్యేక దృష్టి పెడతాం. కాకినాడ బీచ్‌ను సుందరంగా చేస్తాం.

రాష్ట్రం కోసం ఆలోచించే కూటమి

పెద్దాపురం టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. ఇది గుర్తించి కూటమిగా ఏర్పడాలని భావించిన వ్యక్తి పవన్. అందరినీ ఒప్పించి కూటమి ఏర్పాటు చేశారు. 2019లో నేను విజయం సాధించినా నన్ను పనిచేయనివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసాలు చేసి సంపద దోచుకున్నారు.

పాతపాటే!

- కూటమి సూపర్ సిక్స్ ముందు తుస్సుమన్న వైసీపీ మేనిఫెస్టో
- విస్తుబోయిన నేతలు.. డీలాపడిన సొంత పార్టీ శ్రేణులు..
- ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతకు జగన్ మొండిచెయ్యి
- బీసీ, ముస్లిం, మైనారిటీల రిజర్వేషన్ల ఊసూ లేదు
- పోలవరానికి మరో అయిదేళ్లు కావాలట
- పింఛనుదారులకు గత ఎన్నికల నాటి తంతే ఈసారీ
- 2028లో రూ.250, 2029లో రూ.250 పెంచుతామని మెలిక
- ఇప్పటికే రూ.4 వేలు పింఛను ఇస్తామని టీడీపీ కూటమి ప్రకటన
- దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని మరో అద్భుత వరం
- మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామన్న చంద్రబాబు
- బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు.. ప్రత్యేక రక్షణ చట్టం
- పథకాలతో కూటమిలో జోష్.. మేనిఫెస్టోతో వైసీపీ కేడర్ డీలా



ఈసారి ఎన్నికల వైసీపీ మేనిఫెస్టో తుస్సుమంది. కొద్దిరోజులుగా జగన్ ప్రకటించే మేనిఫెస్టోపై రకరకాల ఊహాగానాలను ఆ పార్టీ నేతలు ప్రచారంలోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచార సమయంలో కూడా ఓటర్లకు పింఛన్లు భారీగా పెంచుతామని, యువతకు ఉద్యోగాలంటూ నేరుగా చెబుతూ వచ్చారు. తీరా మేనిఫెస్టో విడుదలైన తర్వాత ఆ పార్టీ వారికే మింగుడుపడడం లేదు. గత ఎన్నికల్లో మాదిరే ఈసారీ 'పెంచుకుంటూ పోతాం' అనే పల్లవినే జగన్ అందుకోవడం విశేషం. గత ఎన్నికల సమయంలో పింఛన్ల ప్రకటనలో కూడా ఇదే గందరగోళం సృష్టించారు. పెంచుకుంటూ పోతామనే దానికి అర్థం ఏమిటో పింఛనుదార్లకు తర్వాతగానీ బోధపడలేదు. ఈసారీ అదే పల్లవి అందుకోవడంతో గత హామీ అమలును గుర్తుచేస్తున్నారు. కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో ఏ పథకాలు లేకపోగా, టీడీపీ ఏడాదికాలం కింద ప్రకటించిన సూపర్ సిక్స్ పేరిట జనం నోళ్లలో నానుతున్న పథకాలతో పోల్చి మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా పింఛన్ల పెంపు, 20 లక్షల ఉద్యోగాల కల్పన, మహాశక్తి పథకాలపై చర్చ జరుగుతోంది.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఈసారి మేనిఫెస్టో రూపకల్పనలోనే వైసీపీ బోల్తాపడింది. ప్రజలకు కొత్తగా ఒక హామీ కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఎన్నో ఊహాగానాలు అల్లుకున్న ఆ పార్టీ కేడర్ సైతం డీలా పడిపోయింది. శనివారం ప్రకటించిన వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టో ముందు బోల్తాపడింది. గతంలోని పథకాలకే కొన్ని రంగులు పులిమి, నవరత్నాలు పేరిట ఉన్న పథకాలనే కొనసాగిస్తామని చెబుతూ రెండు పేజీలతో సరిపెట్టారు. నిజానికి ఆనాటి హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. అలాగే ఆయా పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను కుదించి, అరకొరగా అమలుచేశారు. దీంతో అర్హులెందరికో లబ్ధి చేకూరలేదు. ఆదిలోనే పింఛను విషయంలో బురిడీ కొట్టించిన వైనాన్ని పలువురు గుర్తుచేస్తున్నారు. మూడు వేల పింఛను ఇస్తామని.. ఏడాదికి రూ.250 ఇవ్వడంపై లబ్ధిదారులు ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. ప్రస్తుత మేనిఫెస్టోలో కూడా ఇదే పాట పాడగా, రూ.500 మాత్రమే పెంచి అది కూడా చివరి రెండు ఏళ్లలో పెంచుతామని మెలిక పెట్టారు. అంటే పెన్షన్ల సొమ్ము ఈ ఏడాది పెంచరట. వచ్చే ఏడాది 2025లో పెంచరు. 2026, 2027లోనూ పెంచరు. ఎన్నికల చివరి ఏడాది అంటే 2028లో రూ.250, ఎన్నికల ఏడాది 2029లో రూ.250 పెంచి మొత్తం రూ.3,500 చేస్తారట. ఈ ప్రకటన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల కింద పెన్షన్ పొందుతున్న వారిలో తీవ్ర ఆవేదన మిగిల్చింది. ఆగ్రహానికి గురిచేసింది. దివ్యాంగులకు వైసీపీ పాలనలో తీరని అన్యాయం చేశారు. వారికి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ఇప్పుడూ వారి మాట మరిచారు. ఇక టీడీపీ ఏడాది కిందటే సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు అనేక వరాలిచ్చింది. ఇప్పుడు కూటమి తరఫున కూడా ఈ పథకాలను ఇస్తామంటూ చంద్రబాబు, పవన్ భరోసా ఇచ్చారు. అందులో నెలకు రూ.4 వేల పింఛన్.. అది కూడా ఏప్రిల్ నుంచే లెక్కకట్టి, జూలై నెలలో ఏకంగా ఏడు వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు నెలకు రూ.ఆరు వేలు ఇస్తానని స్పష్టంచేశారు. ఇక వైసీపీ అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించింది. దీంతో వేలాది మంది బీసీలు స్థానిక సంస్థల్లో పదవులు కోల్పోయారు. కానీ జగన్ మేనిఫెస్టోలో ఆ ఊసే లేదు. టీడీపీ కూటమి మాత్రం బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతామని స్పష్టంచేసింది. అలాగే బీసీలకు కూడా రక్షణ చట్టం తీసుకొస్తామని సూపర్ సిక్స్‌లో ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లు, బీసీ రక్షణ చట్టంపై ప్రధానంగా ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మహిళల విషయంలో కూడా పాతపాటే. ఎంతో చేశానని, అదే మళ్లీ చేసేస్తానని జగన్ చెప్పారు. ఇది కూడా మహిళల్లో మరింత అసంతృప్తిని రేపింది. బటన్ నొక్కిన కొన్ని నెలలకు కొంత జమ చేస్తూ ఈ ఐదేళ్లు మహిళలను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. ఇవాళ టీడీపీ కూటమి మహిళలకు మహాశక్తి పథకం అమలుచేయనుంది. ఆడబిడ్డ నిధి కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది మహిళలకు నెలకు రూ.1500 ఇస్తారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు వారికి ఏడాదికి రూ.15వేల వంతున ఇస్తామని ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రకటించింది. ఇక రైతులకు ఏడాది రూ.20 వేలు పంట పెట్టుబడికి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇలా అన్నివర్గాల సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనే కూటమి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఇవాళ జగనన్న ఇళ్లు పేరిట కేవలం సెంటు భూమి పనికిరాని భూముల్లో ఇవ్వగా, తాము 3 సెంట్ల భూమి ఇచ్చి.. ఇల్లు మంజూరు చేస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. 2019కే పూర్తి కావలసిన పోలవరాన్ని ఐదేళ్లలో గాలికి వదిలేసిన జగన్, దీని నిర్మాణానికి మరో ఐదేళ్లు కావాలని మేనిఫెస్టోలో పెట్టడాన్ని జనం ఆక్షేపిస్తున్నారు. తిరకాసు, మోసపూరిత హామీలతో బురిడీ కొట్టించాలని చూస్తే.. జనం నమ్మరని జగన్ మేనిఫెస్టోపై పలువురు వ్యాఖ్యానించారు.

ఒరిగేదేం లేదు...



వైసీపీ మేనిఫెస్టో నిరాశపరిచింది. దీనివల్ల ప్రజలకు కొత్తగా ఒరిగేది ఏం లేదు. అవ్వాతాతలకు రూ.4 వేల పింఛను ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. సూపర్ సిక్స్ పథకాలు అందరికీ మేలు చేకూరుస్తాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి నెలా ఆర్థిక చేయూత ఇస్తామని బాబు హామీ ఇచ్చారు.

- కరుటూరి విశ్వేశ్వరి, అంకంపాలెం

చంద్రబాబు హయాంలోనే బాగు



ప్రతీ ఇంటికీ పింఛన్, ఇల్లు, రేషన్‌కార్డులు వంటి పథకాలు చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కూడా అమలుచేశారు. కొత్తగా జగన్ ప్రభుత్వంలో ఒరగబెట్టింది లేదు.

- సత్యవతి, సామర్లకోట

అంతా మోసమే..



ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ గత ఎన్నికల మేనిఫెస్టోలో 95 శాతం పూర్తి చేశానని చెప్పి ప్రజల్ని మోసం చేశారు. యువకులు నిరుద్యోగంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రజలకు ఏదీ అందలేదు.

- సత్తిరాజు ఆదిత్యకిరణ్, కొత్తపేట

వై..చీప్ రాజకీయం!



పిఠాపురంలో పట్టుబడిన మద్యం

- ఎన్నికల వేళ.. వైసీపీ మద్యం స్కీమ్
- గోవా నుంచి గోదావరికి అక్రమ మద్యం
- భారీగా కంటెయినర్లలో డంప్
- లోకల్‌గానూ తయారీ
- అన్ని నియోజకవర్గాలకు సరఫరా
- పిఠాపురం,కాకినాడల్లో పట్టివేత
- తూతూ మంత్రంగా కేసులు

పిఠాపురం, ఏప్రిల్ 27: వైసీపీ నాయకులా మజాకానా.. టక్కుటమార విద్యల్లో ఆరితేరిన వారు.. అందుకే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చీపు రాజకీయానికి తెరలేపుతున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీగా మద్యం నిల్వలు తెచ్చి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిల్వ చేస్తోంది. గోవా మద్యంతో పాటు రాష్ట్రంలోనూ తయారు చేసి అవే లేబుల్స్ ఉన్న సీసాల్లో నింపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికే కాకినాడ, పిఠాపురంలలో భారీగా మద్యం డంప్‌లు బయట పడ్డాయి. విలువ రూ.1.50 కోట్లకు పైగా ఉంది. ఇంతకు వంద రెట్లు అధికంగా కాకినాడ జిల్లాకు మద్యం నిల్వలు చేరినట్టు సమాచారం.

బరితెగించిన వైసీపీ నేతలు..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియకుండానే జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. వైసీపీ నేతలు బరితెగించి భారీగా మద్యం పంపిణీ చేస్తున్నారు. గోవా నుంచి కంటెయినర్ల ద్వారా మద్యం జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నట్టు సమాచారం. అంతే కాకుండా గోవా మద్యం సీసాల్లో రాష్ట్రంలోని రెండు ఫ్యాక్టరీల్లో తయారైన మద్యాన్ని నింపి ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్టు సమాచారం. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంతో పాటు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజవర్గాలకు ఇప్పటికే భారీ మద్యం నిల్వలు చేరాయి. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.5 నుంచి రూ.పది కోట్లు విలువైన మద్యాన్ని చేర్చినట్టు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా తీసుకువచ్చినట్టు చెబుతున్నారు.

పట్టుబడిన మద్యం బ్రాండ్లు ఇవే



పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన దాడుల్లో పట్టుబడిన మద్యం బ్రాండ్లు అన్నీ గోవా తయారీ మద్యం బ్రాండ్లుగా చెబుతున్నారు. ఇవన్నీ ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత అధికంగా ఉంటుంది. పట్టుబడిన వాటిలో రాయల్ బ్లూ, గోవా కిక్ విస్కీ, బొంబాయి సెంట్రల్ క్లాసిక్ టోటల్ విస్కీ, గోవా క్విక్ ఫైనెస్ట్ సుపీరియర్ విస్కీ,యూకే నెంబరు 1 రేర్ విస్కీ, రాయల్ స్టైల్ విస్కీ, గోవా విస్కీ బ్రాండ్లు ఉన్నాయి.ఇప్పుడు ఇవి ఎక్కడ తయారయ్యాయి, వీటిని ఎలా తరలించారు, ఎవరు తరలించమన్నారు తదితర విషయాలపై దర్యాప్తు చేయాల్సిన పోలీసు,సెబ్ అధికారులు అసలు విషయాన్ని వదిలి తూతూమంత్రంగా నాలుగుచోట్ల ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఇంత భారీగా మద్యం నియోజకవర్గాలకు తరలించిన వైసీపీ రానున్న రోజుల్లో ఇక ఎన్ని కుట్రలకు తెరలేపుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ కీలక నేతల ఫ్యాక్టరీల్లోనే..

ఈ అక్రమ మద్యం వ్యవహారంలో రాష్ట్రానికి చెందిన వైసీపీ ఎంపీలుగా ఉన్న ఇద్దరు నేతలు, కాకినాడ జిల్లా కేంద్రం కీలక నేత ఒకరు కీలకపాత్ర పోషించినట్టు చెబుతున్నారు. ఆ ఇద్దరు ఎంపీలకు లిక్కర్ తయారీ యూనిట్లు ఉండడంతో అక్కడ ఈ మద్యాన్ని తయారు చేయించి గోవా బ్రాండ్ల స్టిక్కర్లు అంటించి ఉన్న సీసాల్లోకి నింపినట్టు చెబుతున్నారు. గోవా మద్యంతో పాటు అంతకు రెండింతలు లోకల్ మద్యం వివిధ ప్రాంతాలకు డంప్ చేసినట్టు చెబుతున్నారు. పిఠాపురం పట్టణంలోని మూడు చోట్ల, కుమారపురంలో ఒక చోట గృహాల్లో డంప్‌లపై ఎస్ఈబీ, పోలీసు అధికారులు దాడులు చేశారు. ఇక్కడ ఏకంగా 52,992 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటి పైగా ఉంటుందని అంచనా. కాకినాడలోనూ మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ.50 లక్షలు ఉంటుంది.రెండు చోట్ల పట్టుబడిన మద్యం చాలా తక్కువని, ఇంతకు వంద రెట్లు నిల్వలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

ఓటర్లను మద్యంతో ముంచెత్తడమే లక్ష్యంగా

ఓటర్లను మద్యం మత్తులో ముంచేయాలని వైసీపీ నేతలు ముందు నుంచీ భావిస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రతి రోజు మద్యం పంపిణీ చేయాలని, పోలింగ్ చివరి ఐదు రోజులు ప్రజలు కోరినంత మద్యం పంపిణీ చేయాలని వైసీపీ పెద్దలు నియోజకవర్గాల నేతలకు చెప్పినట్టు సమాచారం.పిఠాపురంలో పవన్‌ను ఓడించాలనే లక్ష్యంతో ఉన్న వైసీపీ అధినాయకత్వం అక్కడ మద్యాన్ని ఏరులై పారించాలని పన్నాగం పన్నినట్టు ఇతర పార్టీల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కాకినాడ, పిఠాపురంలలో మద్యం నిల్వలు పట్టుబడిన నేపథ్యంలో రెండు, మూడు రోజుల పాటు లిక్కర్ పంపిణీకి వైసీపీ నేతలు తాత్కాలికంగా ఫుల్‌స్టాప్ పెట్టారు. అంతే కాకుండా వైసీపీ నేతలు తమ మద్యం నిల్వలను దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. సెబ్, పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తే మరింత భారీగా నిల్వలు బయటపడతాయని అందరు భావిస్తున్నా ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



మద్యం దందా

- ఎక్కడికక్కడ రహస్య ప్రదేశాల్లో మద్యం డంప్
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వైసీపీ ఎర
- ఉమ్మడి జిల్లాలోకి గోవా మద్యం దిగుమతి

ఇవేం బ్రాండ్లు..!

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 27 : వైసీపీ పాలనలో రకరకాల మద్యం బ్రాండ్లు తెచ్చి నాణ్యత లేని సరుకుతో మద్యంబాబులను ఇష్టాను సారం దోచుకున్న విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మద్యంతో ప్రలోభపెట్టడానికి ఇప్పటికే కావలసినంత సరుకును రహస్య శిబిరాల్లో ఆ పార్టీ డంపు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. రాజమహేంద్రవరం పరిధిలోని దివాన్ చెరువు ప్రాంతంలో అంగన్‌వాడీ పాలప్యాకెట్ల పేరిట ఓ పెద్ద లారీ సరుకును డంప్ చేసినట్టు తాజా సమాచారం. ప్రస్తుతం మార్కెట్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకు దొరకని విధంగా ఇప్పటికే కొరత సృష్టించింది. గత ఏడాది కంటే అమ్మకాలు 30 శాతం కంటే ఎక్కువ ఉండకూడదని, అందువల్లే షాపుల్లో సరుకు తగ్గించామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో తమ వద్ద భారీగా నిల్వలు ఉంచిన మద్యాన్ని ఓటర్లకు ఎరగా వేసే ప్రయత్నాలు వైసీపీ నేతలు మొదలుపెట్టారు. పోలింగ్ దగ్గరపడే సమయానికి పెద్దఎత్తున మద్యం పంపిణీ చేసేందుకు వీలుగా ఎక్కడికక్కడ మద్యం నిల్వలను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

గోవా సరుకు..!

ఆత్రేయపురం, ఏప్రిల్ 27: ప్రస్తుత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు నెలల ముందే పెద్దఎత్తున గోవా మద్యం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి దిగుమతి అయింది. ప్రాంతాల వారీగా ఎక్కడికక్కడ గొడౌన్లలో నిల్వలు దాచారు. గోవాలో ఏ బ్రాండ్ కావాలని అడిగితే ఆ బ్రాండ్ స్టిక్కర్‌తో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉన్న చీప్‌లిక్కర్‌తో తయారుచేసే మాఫియా ఉన్నట్టు చెబుతున్నారు. అలా ఒక లారీకి బాక్స్‌కు 48 బాటిల్స్ చొప్పున 600 నుంచి 1200 బాక్సులు లారీల ద్వారా గోవా లిక్కర్ గ్యాంగ్‌లు జిల్లాకు తీసుకువచ్చి ఆర్డర్ చేసిన వారికి అప్పగిస్తారు. లారీ చీప్ లిక్కర్ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేస్తారు. ఈ దందా సాగించే స్థానిక వ్యాపారులు మూడు రెట్లు వేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం చీప్ లిక్కర్ ధర రూ.130 ధర ఉండగా గోవా బాటిల్ రూ.60కే లభిస్తుంది. నిజానికి ఈ దందా సాగాలంటే మామూలు రోజుల్లో కష్టం. పోలీసులు, సెబ్ అధికారులు చూడీచూడనట్టు ఉంటేనే వీలవుతుంది. ప్రభుత్వ పెద్దల సహకారంతోనే భారీ ఎత్తున గోవా మద్యం ఇక్కడకు డంప్ అయినట్టు సమాచారం.

రాగంపేటలో మూసేసిన మద్యం దుకాణం



దుకాణాల్లో నియంత్రణ

గండేపల్లి, ఏప్రిల్ 27: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిననాటి నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలపై ఎన్నికల అధికారులు ఆంక్షలు విధించారు. ఒక్కొక్కరికి ఒక్కో బాటిల్ మాత్రమే మద్యం అమ్మాలని నిబంధన పెట్టారు. దీంతో సాయంత్రానికే మద్యం టార్గెట్‌లు అయిపోవడంతో దుకాణాలు మూసేస్తున్నారు. ఈ మద్యం కూడా వైసీపీ నాయకుల అండతో పక్కదారి పడుతోంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అమ్మకాలు చేసేవారు. గత సంవత్సరం ఈరోజు ఎంత మద్యం అమ్మారో, ఇప్పుడే అంతే మద్యం అమ్మాలని నిబంధన పెట్టారు. అయితే మధ్యాహ్నానికే మద్యం అయిపోతుండడంతో సరుకంతా ఎక్కడికిపోతుందో అర్థం కావడంలేదని పలువురు నిలదీస్తున్నారు.

ఇదే దందా అంటే..

సామర్లకోట, ఏప్రిల్ 27: రోజూవారీ అమ్మకాల లక్ష్యం పూర్తయితే ప్రభుత్వ మద్యం దుకాణాలను మధ్యాహ్నానికే మూసివేస్తున్నారు. దీంతో మందుబాబులు అనివార్యంగా బెల్ట్‌షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. సదరు బెల్ట్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తున్నారు. బెల్ట్ షాపులవారు రూ.50 లాభం చూసుకుని విక్రయిస్తున్నారు. రోజూవారీ అలవాటు ఉన్నవారు చేసేదిలేక అంతపెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఆ దందాను నియంత్రించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి అయినా చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సామర్లకోటలో దుకాణం క్లోజ్



మద్యాన్ని స్టాకేశారు..

కొత్తపల్లి, ఏప్రిల్ 27: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వలు చేసినట్టు సమాచారం. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాల్లోని సరుకును అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు రాత్రి సమయాల్లో ఆయా గ్రామాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రత రెండు, మూడు రోజుల నుంచి ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాల్లో నిల్వలు ఉంచినట్టు తెలుస్తోంది.



గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల పంట పొలాల మధ్య సాగుతున్న ర్యాలీ





వరుణ్‌తేజ్ రోడ్‌షో

- పవన్‌కు మద్దతుగా మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ ప్రచారం
- గొల్లప్రోలు మండలంలో పలు ప్రాంతాల్లో పర్యటన
- భారీగా తరలివచ్చిన అభిమానులు..కూటమి కార్యకర్తలు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 27: ప్రముఖ సినీనటుడు, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి, దుర్గాడ గ్రామాల్లో శనివారం రాత్రి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. ముందుగా తాటిపర్తి గ్రామంలోని అపర్ణాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం రోడ్‌షో ప్రారంభించారు. ఓపెన్‌టాప్ కారులో నిల్చుని ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో ప్రచారం సాగించారు. వరుణ్‌తేజ్ రోడ్‌షో ముందు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ జరిగింది. జనసైనికులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీగా తరలివచ్చారు. మహిళలు వరుణ్‌పై పూలవర్షం కురిపించారు. హారతులు ఇచ్చారు. తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి గ్రామాల మీదుగా దుర్గాడ వరకూ సాగిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. దుర్గాడలో వరుణ్ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఎక్కడికక్కడ ప్రజలు, మహిళలు ఇళ్ల బయటకు వచ్చి గాజుగ్లాసు చూపిస్తూ అభివాదం చేయడం విశేషం. ప్రచారంలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, టీడీపీ యువనేత గిరీష్‌వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

పాదగయలో పూజలు



పిఠాపురం, ఏప్రిల్ 27: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ప్రముఖ సినీనటుడు వరుణ్‌తేజ్ సందర్శించారు. తన తండ్రి, జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను శనివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వరుణ్‌తేజ్ తల్లి కూడా పాల్గొన్నారు. ఆలయ విశిష్టత గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. వరుణ్‌తేజ్ రాక తెలుసుకున్న అభిమానులు, జనసైనికులు భారీగా తరలివచ్చారు. తన బాబాయి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపు కోసం పూజలు చేసినట్లు వరుణ్‌తేజ్ తెలిపారు.

మెట్టలో రాజకీయ పర్వతం

- ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాజకీయ దిగ్గజ కుటుంబం
- ఒకే కుటుంబంలో ఐదుగురు ఎమ్మెల్యేలు
- పర్వత ఫ్యామిలీకి నియోజకవర్గానికి విడదీయరాని బంధం



పర్వత గుర్రాజు



పర్వత సుబ్బారావు



పర్వత బాపనమ్మ



పర్వత చిట్టిబాబు



పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27: ప్రత్తిపాడు నియోజకవర్గ రాజకీయ చరిత్రకు పర్వత కుటుంబానికి విడదీయరాని బంధం ఉంది. రాజకీయ పదవులకు కేరాఫ్ అడ్రస్‌గా పర్వత కుటుంబం ఉంది. 14 విడతలు జరిగిన నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కుటుంబం 8 విడతలు పోటీ చేసి 5 విడతలు విజయం సాధించి 3 విడతలు ఓటమి చూసింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పర్వత కుటుంబం నుంచి ప్రధాన రాజకీయ పక్షం నుంచి అవకాశం ఉంటుందని పర్వత అభిమానులు భావించినా చివరికి నిరాశ మిగిలింది. ఈ ఎన్నికల్లో పర్వత కుటుంబం నుంచి ఎవరూ ఎన్నికల బరిలో లేరు. పర్వత కుటుంబానికి ఎమ్మెల్యే పదవికి ఆద్యుడు పర్వత గుర్రాజు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1955లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆయన మొట్టమొదటి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన సోదరుడు పర్వత సుబ్బారావు 1994లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించగా, సుబ్బారావు సతీమణి బాపనమ్మ 1999లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అలాగే పర్వత గుర్రాజు మరో సోదరుడు పర్వత శ్రీరామమూర్తి తనయుడు పర్వత సత్యనారాయణమూర్తి (చిట్టిబాబు) 2009లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే గుర్రాజు మరో సోదరుడు పర్వత కొండలరావు కుమారుడు పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ 2019లో వైసీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. ప్రస్తుతం ఆయనే ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ కుటుంబంలోని పర్వత శ్రీరామమూర్తి రెండో కుమారుడు పర్వత రాజబాబు ప్రస్తుతం శంఖవరం మండలాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. పర్వత గుర్రాజు సోదరుడు నరసింహారావు శంఖవరం సమితికి 20 ఏళ్ల పాటు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయన సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌గా కూడా కొనసాగారు. ఇంకా పర్వత కుటుంబీకుల్లో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సతీమణి సత్యవేణి జడ్పీటీసీగా గతంలో పనిచేశారు. పర్వత రెడ్డి నాయుడు అన్నవరం దేవస్థానం డైరెక్టర్‌గా రెండు సార్లు నియమితులయ్యారు. ప్రస్తుతం పర్వత గుర్రాజు తనయుడు సత్యనారాయణ సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాజకీయ పదవులకు చిరునామాగా ఉండే పర్వత కుటుంబం నుంచి ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం లభించకపోవడం ఆ కుటుంబ అభిమానులను నిరుత్సాహానికి గురి చేసింది.

రాజకీయ ఉద్దండుల కోట కొత్తపేట

రాజకీయ ఉద్దండుల కోటగా కొత్తపేట నియోజకవర్గానికి పేరుంది. వాడపల్లి వెంకన్న, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి, మందపల్లి శనేశ్వరస్వామి ఆలయాలు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. గౌతమి, వశిష్ట నదీపాయల మధ్య ఎన్నో విశిష్టతలు కలిగిన కొత్తపేట నియోజకవర్గం ఎందరో రాజకీయ నేతల ఏలుబడిలో కొనసాగింది.

వాడపల్లి వెంకన్న ఆలయం



1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గాన్ని అపర చాణుక్యుడిగా పేరు పొందిన కళా వెంకట్రావు, రాజకీయ దిగ్గజం ఎంవీఎస్ సుబ్బరాజు, రాజకీయ ఉద్దండులు చిర్ల సోమసుందరరెడ్డి, బండారు సత్యానందరావు పాలించారు. పునర్విభజన తర్వాత జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంగా మారి కోనసీమ రాజకీయాలకు కేంద్ర బిందువైంది. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో 37 గ్రామాలు ఉండగా పునర్విభజన అనంతరం 57 గ్రామాలకు చేరుకుంది. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలతో భౌగోళికంగానే కాకుండా సామాజిక సమీకరణాల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. వైసీపీ తరఫున ప్రస్తుత ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ తరఫున బండారు సత్యానందరావు రాజకీయాలను శాసిస్తూ వచ్చారు. ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కలయికతో కూటమి అభ్యర్థిగా బండారు సత్యానందరావు నుంచి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గట్టిపోటీనే ఎదుర్కోనున్నారు.

● (కొత్తపేట)

రావులపాలెం కోనసీమ ముఖద్వారం



ఆత్రేయపురం పూతరేకులు ఖండ్రిగ పాలకోవ, రావులపాలెం కుండ బిర్యానీ ఈ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో స్పెషల్స్



రాజకీయ చైతన్యం

కొత్తపేట ప్రత్యేక రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గం. ఇక్కడ ఏ పార్టీ విజయం సాధిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేపడుతోంది. అయితే నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 15సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, రెడ్డి కాంగ్రెస్‌తో కలుపుకుని ఏడుసార్లు విజయం సాధించగా నాలుగుసార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ గెలుపొందాయి.

ఓటర్ల వివరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 3 లక్షల 36 వేల మంది ఉన్నారు. నియోజకవర్గంలో 2,48,392 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 1,24,998 మంది కాగా పురుషులు 1,23,389 మంది ఉన్నారు. ఇతరులు 5గురు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 262 ఉన్నాయి.


సమస్యలు ఇవి

ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సి ఉంది. మధ్య డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల, వాడపాలెం లాకుల వ్యవస్థను ఆధునికీకరించి రైతుల సాగునీటి ఇబ్బందులను పరిష్కరించాల్సి ఉంది. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు మెగా వాటర్ ప్రాజెక్టు ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. రావులపాలెం జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించాలి. మురుగునీరు సక్రమంగా పారేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వాడపల్లి, మందపల్లిలను టూరిజం ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.


రావులపాలెం-జొన్నాడ గౌతమి వంతెన



ఎమ్మెల్యేలుగా పనిచేసింది వీళ్లే..



కళా వెంకట్రావు



ఎంవీఎస్ సుబ్బరాజు



దెందులూరి భానుతిలకం



చిర్ల సోమసుందర్‌రెడ్డి



ఐఎస్ రాజు



బండారు సత్యానందరావు



చిర్ల జగ్గిరెడ్డి

సంవత్సరం	విజేత	పార్టీ
1959	కళా వెంకట్రావు	కాంగ్రెస్
1962	ఎంవీఎస్ సుబ్బరాజు	కాంగ్రెస్
1967	ఎంవీఎస్ సుబ్బరాజు	కాంగ్రెస్
1972	దెందులూరి భానుతిలకంరెడ్డి	కాంగ్రెస్
1978	ఎంవీఎస్ సుబ్బరాజు	జనతాపార్టీ
1983	చిర్ల సోమసుందరరెడ్డి	టీడీపీ
1985	ఐ.ఎస్.రాజు	టీడీపీ
1989	చిర్ల సోమసుందరరెడ్డి	కాంగ్రెస్
1984	బండారు సత్యానందరావు	టీడీపీ
1999	బండారు సత్యానందరావు	టీడీపీ
2004	చిర్ల జగ్గిరెడ్డి	కాంగ్రెస్
2009	బండారు సత్యానందరావు	ప్రజారాజ్యం
2014	చిర్ల జగ్గిరెడ్డి	వైసీపీ
2019	చిర్ల జగ్గిరెడ్డి	వైసీపీ


మద్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

జన చేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
ఆదివారం 28 ఏప్రిల్ 2024 7

మద్యం కేసును నీరుగార్చుతున్నారా?

- వైసీపీ కీలక నేతను తప్పించి యువకుడిపై కేసు
- రెండుచోట్ల పోలీసులు, మరో రెండుచోట్ల సెబ్‌లో కేసులు నమోదు
- వైసీపీ నేతలంతా పరారీలో ఉన్నారట..!
- వైసీపీ పెద్దల ఒత్తిడితో కేసు తారుమారు

పిఠాపురం, ఏప్రిల్ 27: ఏకకాలంలో నాలుగు చోట్ల దాడులు నిర్వహించి కోటి రూపాయల విలువైన గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటనలో నమోదైన కేసులను నీరుగార్చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ కీలక నేతను తప్పించి అతని వద్ద పనిచేసే కార్మికుడిపై కేసు పెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పెద్దల ఒత్తిడితో మద్యం నిల్వలు వెనుక ఉన్న వారిపై కేసు దర్యాప్తు వెళ్లకుండా అడ్డుపుల్ల వేసి కేసులను తారుమారు చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం నిల్వలు పట్టుకునే వరకూ పకడ్బందీగా వ్యవహరించిన సెబ్, పోలీసు అధికారులు రాత్రి జరిగిన పరిణామాల తర్వాత నోరు మెదిపేందుకు ఇష్టపడకపోవడం, నమోదయిన కేసుల వివరాలను రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఓడించేందుకు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు భారీగా మద్యాన్ని డంప్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్టేట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు అధికారులు పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో వట్టూరి సతీష్‌కుమార్, సాలిపేటలో అంబటి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటితో పాటు మండలంలోని కుమారపురం గ్రామంలోని వేమగిరి సువార్తమ్మ ఇళ్లపై శుక్రవారం రాత్రి ఏకకాలంలో దాడి చేశారు. నాలుగు చోట్ల కలిపి 52,992 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు సోదరుడు వీరబాబుదిగా స్థానికులు తెలిపారు. మద్యం దొరికిన ఇళ్లన్నీ వైసీపీ నాయకులవే కావడంతో ఆ పార్టీకి చెందిన నిల్వలుగా తేలిపోయింది. ఇక్కడ వరకూ పకడ్బందీగా వ్యవహరించిన అధికారులు రూటు మార్చారు.

కేసులు పంచుకున్నారు

నాలుగు చోట్ల దొరికిన మద్యానికి సంబంధించి పిఠాపురం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క కేసు, సెబ్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని జగ్గయ్య చెరువు కేసులో వట్టూరి సతీష్‌కుమార్, కుమారపురం కేసులో వేమగిరి సువార్తమ్మపై పోలీసులు కేసు నమోదు చేయగా.... సెబ్ అధికారులు సాలిపేటలో పట్టుబడిన మద్యం విషయంలో అంబటి వీర వెంకట సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేశారు. వైఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి విషయంలో మాత్రం అక్కడ పనిచేసే జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన 20 సంవత్సరాల యువకుడు గండికోట దుర్గారామయ్యపై కేసు నమోదు చేయడం గమనార్హం. నాలుగు కేసుల్లో దొరికిన మద్యం నిల్వలు అన్నీ ఒకే రకానికి చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అయినప్పుడు కేసులు పంచుకోవడం, ఎవరి దర్యాప్తు వారు చేస్తున్నట్టు చెప్పడంతో అనుమానాలు ప్రారంభమయ్యాయి.

ఒత్తిళ్లు పనిచేశాయా?

పిఠాపురం పట్టణం, మండలంలోని కుమారపురంలో పట్టుబడిన మద్యం విషయంలో వైసీపీ పెద్దల ఒత్తిళ్లు పనిచేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా కోటి రూపాయలు విలువైన మద్యం పట్టుబడినప్పుడు, అది ఎన్నికల సమయంలో ఎస్పీ లేదా ఆ స్థాయి అధికారి వివరాలు వెల్లడిస్తారు. ఇక్కడ మాత్రం అది జరగలేదు. వైసీపీ పట్టణాధ్యక్షుడి బంధువులకు చెందిన ఇల్లుగా చెబుతున్నా, వారిని తప్పించి ఒక యువకుడిపై కేసు నమోదు చేయడం, అసలు సరుకు ఎవరు తెచ్చారు, ఎవ్వరు తెమ్మన్నారు, ఎక్కడి నుంచి వచ్చింది తదితర విషయాలు దర్యాప్తు చేయాల్సిన పోలీసులు, సెబ్ అధికారులు నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పి తప్పించుకోవడం ఒత్తిళ్ల ప్రభావమేనని చెబుతున్నారు. ఇది ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అది కాకుండా నాసిరకం మద్యాన్ని స్థానికంగా తయారు చేసి గోవా మద్యం బాటిళ్లల్లో నింపారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిని అధికారులు పట్టించుకోవడం లేదా లేక ఒత్తిడులతో పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సామర్లకోటలో డీఆర్ఎం పర్యటన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

సామర్లకోట, ఏప్రిల్ 27: విజయవాడ రైల్వే డివిజినల్ మేనేజర్ నరేంద్ర వి.పాటిల్ సతీసమేతంగా శనివారం సాయంత్రం ప్రత్యేక రైలులో సామర్లకోటకు చేరుకున్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సామర్లకోటకు చెందిన పలువురు రైల్వే ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ కార్యక్రమంలో రూ. 32 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులు అమలు తీరును డీఆర్ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా సామర్లకోటకు చెందిన పలువురు రైల్వే ఉన్నతాధికారులతో డీఆర్ఎం సమీక్షించారు. ప్రయాణికులకు అందుతున్న వివిధ సేవలపై సమీక్షించిన డీఆర్ఎం మరిన్ని సేవలందించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సామర్లకోటలోని పంచారామ పుణ్యక్షేత్రమైన కుమార రామ భీమేశ్వరాలయం చేరుకుని స్వామివారికి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు స్వాగతం పలికి ఆలయ పురాతన విశిష్టతపై సమగ్రంగా డీఆర్ఎం దంపతులకు వివరించారు. అనంతరం ప్రసాదాలు, స్వామి, అమ్మవారి చిత్రపటాలను, శేష వస్త్రాలను డీఆర్ఎం దంపతులకు అందజేశారు. రైల్వే అధికారులు శివప్రసాద్, అనంతలక్ష్మి, కేవీ గిరి, బీవీ. రామసుబ్బారావు, ఎం.రవికాంత్, ఏజేవీవీఎస్ నారాయణరాజు, ఏవీకె సంతోష్‌కుమార్, ఎ.బసవేశ్వరరావు, జీకేఎస్ శ్రీదేవి బొట్టా లోవరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

రెండు రోజులు పవన్ రోడ్‌షో

29, 30 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటన

పిఠాపురం, ఏప్రిల్ 27: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 29,30వ తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శనివారం మీడియాకు తెలియజేశారు. 29వ తేదీ ఉదయం 8 గంటలకు గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద రోడ్‌షో ప్రారంభమై కొడవలి, వన్నెపూడి, మీదుగా పిఠాపురం మండలంలోకి ప్రవేశించి వెల్దుర్తి, పి.తిమ్మాపురం, బి.కొత్తూరు, గోకివాడ, జములపల్లి, నరసింగపురం, ఎల్ఎన్‌పురం, విరవాడ, విరవ, మల్లాం, జల్లూరు, కందరాడ, కుమారపురం గ్రామాల మీదుగా సాగుతుందని తెలిపారు. 30వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు చిత్రాడలో రోడ్‌షో ప్రారంభించి గొల్లప్రోలు పట్టణంలో కొనసాగుతుందని చెప్పారు. 29వ తేదీ రోడ్‌షోలో పంట పొలాలను పరిశీలించడంతో పాటు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్వీర్యం కావడం వలన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుంటారని... రైతులు, ఆయా వర్గాల ప్రజలతో మాట్లాడతారని వివరించారు. టీడీపీ, జనసేన. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పవన్ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

ఓటుతో తోట త్రిమూర్తులుకు బుద్ధి చెప్పాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత నేతల పిలుపు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

మండపేట, ఏప్రిల్ 27: దళిత యువకుల శిరోముండనం కేసులో శిక్ష పడిన తోట త్రిమూర్తులును ఓటు అనే వజ్రాయుధంతో ఓడించి బుద్ధి చెప్పాలని దళిత సంఘాల నేతలు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని శుభమస్తు కల్యాణ మండపంలో శనివారం దళిత నేత దూళి జయరాజు అధ్యక్షతన ఏపీలో దళితులపై దమనకాండను నిరసిస్తూ దళిత జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి పలువురు దళిత నేతలు, దళిత ఉద్యమ నేతలు హాజరయ్యారు. జాతీయ ఎరహక్కుల సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు దళిత యువకుల శిరోముండనం కేసులో శిక్ష పడిందని... అలాంటి వ్యక్తికి ఇపుడు అసెంబ్లీ సీటు ఇవ్వటం సిగ్గుచేటన్నారు.

దళిత ఉద్యమ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ దళితులపై శిరోముండనం జరిగినప్పుడు దళిత నేత బొజ్జా తారకం, తాను వెంకటాయపాలెం వెళ్లి నిజ నిజాలను వెలికి తీశామని, ఈ సంఘటనపై ఎనలేని పోరాటం చేసిన వ్యక్తి బొజ్జా తారకం అన్నారు. తోటను దళిత నేతలంతా దళితాసుర అని ఆరోపించారు. సభకు అధ్యక్షత వహించిన దూళి జయరాజు మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో ఉన్న 33 వేల దళిత ఓట్లు చీలిపోకుండా కూటమికి వేసి కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని కోరారు. తోట అరాచకాలను న్యూడెమోక్రసీ నాయకుడు, దళిత ఐక్య పోరాట సమితి నాయకుడు చీకట్ల వేంకటేశ్వరరావు వివరించారు. రాష్ట్రంలో జగన్ రాజ్యాంగం నడుస్తోందని న్యాయవాది మాదే ప్రసాదరావు అన్నారు. సమావేశంలో దళిత నేతలు నబ్బితి ఫణీశ్వరరావు, కాశి వెంకట్రావు, చీకట్ల వెంకటేశ్వరరావు, సరాకులు అబ్బులు, మోరంపూడి రాజ్‌కుమార్, కొక్కి వెంకటేశ్వరరావు, కొవ్వాడ అప్పన్నబాబు, పిట్టా రాజబాబు, విన్నకోట రాజేష్, మందపల్లి చంద్రశేఖర్, ముమ్మిడిరపు ఆదినారాయణ, కోడి చిన అప్పారావు, మలకా అప్పారావు, పెయ్యల యాకోబు, బొత్స నరసింహమూర్తి, బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కె.సాయిరాం, దళిత నేతలు పాల్గొన్నారు.

రేపు కాకినాడలో పీసీసీ చీఫ్ షర్మిల రోడ్‌షో

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27: ఈనెల 29న కాకినాడలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్‌షో నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విశాఖ నుంచి రోడ్ మార్గం గుండా బయలుదేరి ఉదయం 11 గంటలకు స్థానిక అచ్చంపేట సెంటర్‌కు చేరుకుంటారు అక్కడి నుంచి కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు వెంట రాగా సర్పవరం సెంటర్, భానుగుడి జంక్షన్, మెయిన్‌రోడ్, జగన్నాథపురం వంతెన, ఎంఎస్ఎన్ చార్టీస్ మీదుగా యానాం రోడ్‌లోని బాలయోగి విగ్రహం వరకు రోడ్‌షో జరపనున్నారు. అనుమతులను బట్టి స్థానిక భానుగుడి జంక్షన్ వద్ద గానీ, జగన్నాథపురం వంతెన వద్ద గానీ ప్రత్యేక వాహనంపై నుంచి షర్మిల ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రోడ్ షో ముగించుకుని అక్కడి నుంచి రోడ్ మార్గం గుండా అమలాపురం, పి.గన్నవరం చేరుకుని ప్రచార కార్యక్రమాల్లో సాయంత్రం 4 గంటల సమయంలో పోలవరం బయలుదేరి వెళ్తారు. ఈ రోడ్ షోలో పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజులతో పాటు కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు పాల్గొననున్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పాండురంగారావు శనివారం మీడియాతో మాట్లాడుతూ... సోమవారం కాకినాడలో జరగనున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్‌షోలో పార్టీ నేతలు, అసెంబ్లీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో అల్లూరిసీతారామరాజు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న అమలాపురం లోక్‌సభ, అసెంబ్లీ కూటమి అభ్యర్థులు హరీష్‌మాధుర్, ఆనందరావు.




మలికిపురం మండలం గూడపల్లిలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్


ప్రచారం చేస్తున్న అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి ఆనందరావు తనయుడు కిరణ్, మెట్ల రమణబాబు తనయుడు సత్య

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

ఓటుతో జగన్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి: అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి హరీష్‌మాధుర్


అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో ప్రచారంలో హరీష్‌మాధుర్, ఆనందరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని అమలాపురం లోక్‌సభ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ఓటు అనే ఆయుధంతో రాష్ట్ర ప్రజలంతా జగన్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. పరిధులు, పరిమితులు లేకుండా జగన్ ప్రభుత్వం యథేచ్ఛగా విధ్వంసాలకు, దోపిడీలకు పాల్పడుతోందని విమర్శించారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని రాజోలు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో హరీష్‌మాధుర్ శనివారం విస్తృతంగా పర్యటించారు. మలికిపురం మండలం గూడపల్లిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సదస్సులో రాజోలు కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని హరీష్ విమర్శించారు. బీసీలకు 34శాతం ఉన్న రిజర్వేషన్లను జగన్ ప్రభుత్వం 24శాతానికి కుదించిందన్నారు. బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సదస్సులో నాయకులు కానుబోయిన ఏసు, మన్నే కొండలరావు, మంద పాటి వెంకటేశ్వర్లు, సూరిమేను దుర్గాప్రసాద్, గుబ్బల శ్రీనివాస్, కేతా శ్రీనివాస్, బందెల పద్మ, చెల్లుబోయిన హెలీన, గెడ్డం సింహ తదితరులు పాల్గొన్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులతో కలిసి హరీష్‌మాధుర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పలుచోట్ల హరీష్‌కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. జగన్ లాంటి బందిపోటును తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. దెందుకూరి సత్తిబాబు రాజు, మంతెన సురేష్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాళ్ల దొరబాబు, నల్లా పవన్ కుమార్, టీడీపీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటేయండి... అభివృద్ధిని గెలిపించండి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27: కూటమి తరపున పోటీచేస్తున్న అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావులకు సైకిల్ గుర్తుపై ఓటేసి అభివృద్ధిని గెలిపించాలంటూ నాయకుల కుమారులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆనందరావు తనయుడు కిరణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తనయుడు సత్య నియోజకవర్గ స్థాయి నాయకులతో కలిసి శనివారం పట్టణ పరిధిలోని 29, 30 వార్డుల్లో ప్రచారం చేశారు. నాయకులు అల్లాడ సోంబాబు, నల్లా శ్రీధర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, కంచిపల్లి అబ్బులు, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, యేడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్, లింగోలు పండు, యాళ్ల నాగసతీష్, ఇసుకపట్ల రఘుబాబు, కొప్పుల నాగమానస, గంపల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎ.వేమవరంలో టీడీపీలో చేరికలు



అమలాపురం రూరల్, ఏప్రిల్ 27: ఎ.వేమవరం గ్రామానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు సమక్షంలో టీడీపీలో చేరారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్టీ కార్యాలయంలో దాసం గోపి, దుర్గా నారాయణ,బుడితి సోమరాజు, మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జంగా సత్యనారాయణ, నాగాబత్తుల శ్రీనివాసరావు, జిల్లెల్ల వెంకటేశ్వరరావు, తోపెల్ల శర్మ టీడీపీలో చేరారు. వారికి ఆనందరావు కండువాలు కప్పి ఆహ్వానించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.87 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 27: కోనసీమ తిరుమల వాడపల్లికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాల భోగం, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ఎండ వేడిని సైతం లెక్కచేయక తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకున్నారు. తులభారాలు, కానుకలు, మొక్కుబడులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.87 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


ఆత్రేయపురం మండలం వాడపల్లిలో ఎన్నికల పరిశీలకుడు పరదీప్‌కుమార్‌కి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం


రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలన

'ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు'

ఆత్రేయపురం, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల పరిశీలకుడు పరదీప్‌కుమార్ కోరారు. రామచంద్రపురం, మండపేట, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకుడిగా నియమితులైన ఆయన శనివారం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ర్యాలి జగన్మోహినీకేశవ స్వామి ఆల యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని ఆత్రేయపురం, ర్యాలి, మెర్లపాలెంల్లో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. తహసీల్దారు వెంకట్రామయ్య, ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఐ భవాని పాల్గొన్నారు.

రావులపాలెం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు ఎన్నికల పరిశీలకుడు పరదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీపోలవరంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ సమయంలో ఏ రకమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్డీయే గెలుపు కోసం హనుమారాధన

రాజోలు, ఏప్రిల్ 27: ఎన్డీయే గెలుపు కోసం తాటిపాక హనుమాన్ ఆలయంలో పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో హార్టికల్చర్ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు శనివారం ప్రత్యేక పూజలు చేయించారు. దివంగత జీఎంసీ బాలయోగి చేపట్టిన రైల్వేలైన్ తదితర పనులు పూర్తి చేస్తానని హరీష్ వాగ్దానం చేశారు. వైద్య విధానపరిషత్ మాజీ డైరెక్టర్ బిక్కిన వీరాస్వామి, రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగదం సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

● లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి జంగా గౌతమ్
● సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులతో కలిసి అమలాపురంలో సమావేశం

భక్తులతో కిటకిటలాడిన బాలబాలాజీ దేవస్థానం

మామిడికుదురు, ఏప్రిల్ 27: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీనారాయణ హోమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామివారిని 3,485మంది దర్శించుకుని 2,619మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.2,59,771 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, ఏప్రిల్ 27: మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1,28,521 వచ్చిందని ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కె.గంగవరం, ఏప్రిల్ 27: టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని నియోజకవర్గం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ భార్య సునీత అన్నారు. శనివారం ఆమె యండగండిలో ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, మార్ని శ్రీధర్, గంటి నాగేశ్వరరావు, పెంకే రామకృష్ణ, బంటుమిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్వో కార్యాలయం పరిశీలన

ముమ్మిడివరం, ఏప్రిల్27: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని అమలాపురం పార్లమెంటరీ వ్యయ పరిశీలకుడు ఉమేష్‌కుమార్ శనివారం సందర్శించారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులకు సంబంధించి అకౌంటింగ్ బృందంతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. సమీక్షలో ఆర్వో వి.మదనమోహనరావు, తహసీల్దార్ శ్రీనునాయక్, అకౌంటింగ్ బృందం ఉన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

మామిడికుదురు, ఏప్రిల్ 27: ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరం ఎస్ఐ పి.సురేష్ కోరారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎన్నికల విధులను వివరించారు. కార్యక్రమంలో మోకా రంగారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, వాసంశెట్టి నాగరాజు, పొన్నమండ సుబ్బారావు, బి.శృజన, పి.రాధ, వై.రవికుమార్ పాల్గొన్నారు.

వైసీపీపై చార్జిషీట్ విడుదల

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 27: సీఎం జగన్‌పై పలు ఆరోపణలతో ఎన్డీఏ కూటమి రూపొందించిన చార్జిషీట్‌ను శనివారం టీడీపీ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టిసూర్యనారాయణ, టీడీపీ నాయకులు కవల నానాజీ, పదం మూర్తి పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు దిగజారిన జగన్

రావులపాలెం, ఏప్రిల్ 27: సీఎం జగన్ శవ రాజకీయాలకు దిగజారిపోయారని, పెన్షన్ పంపిణీ విధానంలో కావాలని లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ఆరోపించారు. శనివారం ఆయన మండలంలోని రావులపాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, వెదిరేశ్వరం, కేతరాజుపల్లి, దేవరపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

పారా మెడికల్ విద్యార్థులకు ర్యాంకులు

అమలాపురంరూరల్, ఏప్రిల్27:డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన వార్షిక పరీక్షల్లో అమలాపురం కిమ్స్ పారా మెడికల్ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించినట్టు వైస్ ప్రిన్సిపాల్ ఫరీద్‌బాబు తెలిపారు.బీఎస్సీ తృతీయ సంవత్సరం పరీక్షల్లో శ్వేతయూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించగా, నాగలక్ష్మి, బ్యూలా, ఐశ్వర్యమోహిత్ మంచిర్యాంకులు సాధించారు. వారిని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, సూపరింటెంటెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, మెడికల్ డైరెక్టర్ హరికిరణ్‌వర్మ అభినందించారు.

దళితుల సంక్షేమ పథకాలను రద్దుచేసిన ఘనత వైసీపీదే



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జంగా గౌతమ్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27: దళిత మంత్రితో పాటు బీసీ ఎమ్మెల్యే ఇళ్లను తగలబెడితే కనీసం పరామర్శ కూడా చేయని ముఖ్యమంత్రిగా జగన్ నిలుస్తారని అమలాపురం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి జంగా గౌతమ్ విమర్శించారు. ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులతో కలిసి అమలాపురంలో శనివారం నిర్వహించిన సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు అధ్యక్షత వహించారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వక్తలు తీవ్రస్థాయిలో విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ తరపున పోటీలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులు అయితాబత్తుల సుభాషిణి, రౌతు ఈశ్వరరావు, పాలెపు ధర్మారావు, సరెళ్ల ప్రసన్నకుమార్, కోట శ్రీనివాసరావులతో కలిసి ప్రచార రథాన్ని గౌతమ్ ప్రారంభించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు విద్యార్థుల ఎంపిక

రాజోలు, ఏప్రిల్ 27: తాటిపాక వేద డిగ్రీ కళాశాలలో శనివారం మెగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బి.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. 14 కార్పొరేట్ కంపెనీలు పాల్గొన్నాయి. 76మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వేద విద్యా సంస్థల సెక్రటరీ రవికుమార్, ప్రిన్సిపాల్స్ సోమేశ్వరరావు, బాపన్న, ఏవో రామరాజు, నాన్ అకడమిక్ డైరెక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడతా: బండారు







రావులపాడులో ప్రచారంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి బండారు, వెదిరేశ్వరంలో ఎన్నికల ప్రచారంలో బండారు సత్యానందరావు, రావులపాడులో టీడీపీలో చేరిన వారితో బండారు

రావులపాలెం, ఏప్రిల్27: వైసీపీఅరాచక పాలనతో తీవ్రంగా నష్టపోయిన అన్నివర్గాల ప్రజల ఆర్థిక పురోభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడతానని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని రావులపాడు, లక్ష్మీపోలవరం గ్రామాల్లో శనివారం ఆయన ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార రథంపై పర్యటిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేయబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గ్రామాల్లో బండారుకు నాయకులు స్వాగతం పలకగా మహిళలు దిష్టితీసి హారతులు ఇచ్చారు. జగన్ అరాచక పాలనకు చరమగీతంపాడి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు కంకణం కట్టుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని మారుమూల ప్రాంతాలతో పాటు ప్రధాన గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తానన్నారు.

చెముడులంకలో టీడీపీలో చేరికలు

ఆలమూరు: చెముడులంకకు చెందిన పలువురు వైసీపీ నాయకులు అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు సమక్షంలో టీడీపీలో చేరారు. కూటమి నాయకులు నాగిరెడ్డి వెంకటరత్నం, నాగిరెడ్డి చిన్న, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చొప్పెల్లలో పలువురు నాయకులు టీడీపీలో చేరారు.

టీడీపీలో చేరిక

రావులపాలెం, ఏప్రిల్ 27: రావులపాడులో ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు సమక్షంలో వైసీపీని వీడి పలువురు టీడీపీలో చేరారు. ఈదుపుగంటి శ్రీనివాసరావు, చిలువూరి వెంకటసుబ్బారావు, పెచ్చెట్టి శ్రీనివాస్, కుడుపూడి సత్యనారాయణ, చిట్టూరి ఆదిత్య, బొక్కా సురేష్‌లకు బండారు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



ముంగండలో చార్జిషీట్స్ ఆవిష్కరిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు

పి.గన్నవరం, ఏప్రిల్ 27: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం,కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముంగండ గణపతి మందిరం వద్ద పలు సామాజిక వర్గాలకు చెందిన కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానించి అనంతరం వారు మాట్లాడారు. జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబులు కార్యకర్తలకు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ముం గండ, రాజుపాలెం గ్రామాల్లో గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో సంసాని పెద్దిరాజు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, వైస్ఎంపీపీ చెల్లుబోయిన గంగాభవాని, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, పెచ్చెట్టి విజయలక్ష్మి, పెచ్చెట్టి వెర్రియ్య, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలిన సీఎం జగన్







రాణేలంక వడ్డిలంకలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న బుచ్చిబాబు, రాణేలంకలో జరిగిన సభలో వైసీపీ నేర చరిత్ర బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న బుచ్చిబాబు, రాణేలంకలో పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు





ముమ్మిడివరం మండలం రాణేలంక, పళ్లవారిపాలెం గ్రామాల్లో దాట్ల బుచ్చిబాబు ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను గాలికొదిలి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని పబ్జీ గేమ్ ఆడుకుంటూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పేర్కొన్నారు. శనివారం రాణేలంక, పళ్లవారిపాలెం, క్రాపచింతలపూడిపాలెం, కమిని గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత పదో మైలురాయి సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు అర్ధాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళ హారతులు, పూలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండంటూ జగన్ అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధించాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. దాట్ల సుబ్బరాజు ఇంటింటికీ వెళ్లి సూపర్-6 పథకాలను వివరించారు. రాణేలంక పెదపేటలో కొంకి అంబేడ్కర్, వాకపల్లి వెంకటరమణ, నక్కా వెంకటరమణ, గిడ్డి వెంకటరమణ, మరో 50మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి దాట్ల సుబ్బరాజు పార్టీకి ఆహ్వానించారు. వడ్డిగూడెంలో వైసీపీ నేర చరిత్ర బ్రోచర్లను దాట్ల సుబ్బరాజు ఆవిష్కరించారు. ఆయాకార్యక్రమాల్లో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి మురుగుళ్ల రఘు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమి, వేగిరౌతు రాజబాబు, చిక్కాల అంజిబాబు, దంగేటి శ్రీను, గొల్లపల్లి గోపి, పొత్తూరి విజయభాస్కరవర్మ, బొక్కా సత్యనారాయణ, చింతలపూడి భీమశంకర్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, దాట్ల బాబు, కొప్పిశెట్టి శేరు, జగతా జానకిరామయ్య కొప్పిశెట్టి శ్రీను, ఇసుకపట్ల ఈశ్వర్‌కుమార్, పాత్రుని బుజ్జి, నడింపల్లి శ్రీనివాసరావు, మిమ్మితి చిరంజీవి, కుంచనపల్లి సురేష్, కుంచనపల్లి నారాయణ, బొంతు నాగరాజు, బొక్కా రుక్మిణి, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మల్లీశ్వరి, దున్నాల నాగమణి, గిడ్డి రత్నశ్రీ, మద్దింశెట్టి పురుషోత్తం, పాటి సతీష్, దూడల స్వామి, గోదశి పుండరీష్, కొప్పిశెట్టి గణేష్, యలమంచిలి బాలరాజు, కాశి లాజర్, చింతలపూడి కొండబాబు పాల్గొన్నారు.

అబద్ధాల పార్టీలో ఉండలేక పోతున్నాం

పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

కాట్రేనికోన, ఏప్రిల్ 27: అబద్ధాల పార్టీలో ఇమడలేకపోతున్నామంటూ మొల్లేటిమొగ వైసీపీ కార్యకర్తలు వ్యాఖ్యానించారు. వైసీపీని ప్రజలు ఛీత్కరించుకుంటుంటే సిగ్గుతో ఆ పార్టీని విడిచి పెట్టామని అన్నారు. శనివారం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మురమళ్ళ పార్టీ కార్యాలయం వద్ద బుచ్చిబాబు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో వైదాడి అప్పలనర్సింగ్, కామరాజు, కాయరాజు, గంగాద్రి, సింహాద్రి, కాలాడి నాగరాజు, సంగాని అగ్గిరాజు, మసేను, ధర్మారావు, తిరుమాని సత్తిబాబు, మల్లాడి గంగాద్రి తదితరులున్నారు. కార్యక్రమంలో పాండురంగారావు, సంగాని వెంకటేశ్వర్లు, బొంబాయి వీరబాబు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన జగన్

అల్లవరం, ఏప్రిల్27: రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని విస్మరించారని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ ఆరోపించారు. కొమరగిరిపట్నంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ఏపీని దోపిడీ రాజ్యంగా మార్చారని ధ్వజమెత్తారు. అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, దెందుకూరి సత్తిబాబు రాజు, మంతెన సురేష్‌రాజు పాల్గొన్నారు.

దోపిడీ పాలనకు చరమగీతం పాడాలి



మండపేట, ఏప్రిల్ 27: ఐదేళ్లలో సీఎం జగన్, ఆయన అనుచరులు ఇసుక, మట్టి, గ్రావెల్‌ను దోచుకున్నారని మండపేట కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఈదోపిడీ ప్రభుత్వాన్ని సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధిచెప్పి రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. కోటిపల్లి- నర్సాపురం రైల్వేలైన్ పనులు పూర్తిచేసి కోనసీమకు రైలుకూత వినిపిస్తానని హరీష్ హామీ ఇచ్చారు. శనివారం కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కూటమిని రాష్ట్రంలో, కేంద్రంలో గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలన్నారు. స్థానిక టీడీపీ నేతలు పువ్వుల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరామ్‌జీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మలికిపురం, ఏప్రిల్ 27: మలికిపురంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గుబ్బల విక్రమ్ ఆర్థిక సహకారంతో శనివారం చలివేంద్ర ప్రారంభించారు. పిండి సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

అల్లవరం, ఏప్రిల్27:టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, జగన్ ఐదేళ్లపాలన పేదలను కష్టాల్లో ముంచేసిందనిఅమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. శనివారం ఆయనటీడీపీ లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి టీడీపీ మండల శాఖ అధ్య క్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో కొమరగిరిపట్నంలో ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీలో చేరిన వారికి ఆనందరావు పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపీరాజు, గుర్రం ఏసుబాబు, ఎస్.సుబ్బరాజు, పరసా కిరణ్, వేగిరాజు వెంకట్రాజు, ఎంపీటీసీ ఎం.శ్రీనివాస్, జనసేన నాయకులు పిండి గణపయ్య, కంకిపాటి వీరబాబు, దంగేటి శ్రీహరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ తరలింపుపై సమీక్ష

యానాం, ఏప్రిల్ 27: యానాం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అక్రమంగా మద్యం తరలిస్తున్న అంశాలపై యానాం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌ఏ మునిస్వామి నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కాకినాడ జిల్లాకు చెందిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్‌కేడీవీ ప్రసాద్, అమలాపురానికి చెందిన ఎక్సైజ్ అధికారి అజయ్‌కుమార్‌సింగ్ హాజరయ్యారు. యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండటంతో ఇతర ప్రాంతాలకు ఎక్కువ సరఫరా అవుతుందన్నారు. యానాం సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. యానాంఎస్పీ రాజశేఖరన్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ షణ్ముగం, జిల్లా ఎక్సైజ్ అధికారులు అమర్‌బాబు, సాయిస్వరూప్, చిట్టిబాబు, రామారావు, లక్ష్మీకాంతం, శ్రీధర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పి.గన్నవరం, ఏప్రిల్ 27: పి.గన్నవరంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని, ముంగండలోని స్ట్రాంగ్‌రూమ్‌ను, నాగుల్లంకలోని 46,47,48 పోలింగ్ కేంద్రాలను అబ్జర్వర్ రాజేశ్వర్‌గోయల్ శనివారం పరిశీలించారు. ఊడిమూడి శివారు ఆదిమూలవారిపాలెంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సముద్రంలో స్నానానికి వెళ్లిన
ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 27: సూర్యారావుపేట సముద్రంలో శనివారం సాయంత్రం స్నానం చేస్తుండగా ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతై మృతి చెందాడు. అమలాపురం మండలం భట్నవిల్లి చిన్నవీధికి చెందిన సరిపెల్ల సురేంద్రవర్మ(22) కాకినాడలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. స్థానికంగా హాస్టల్‌లో ఉంటు న్నాడు. శనివారం సరదాగా బీచ్‌లో గడుపుదామని 25 మంది సహచర విద్యార్థులతో కలిసి బస్సులో కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌కు వెళ్లారు. అక్కడ కాసేపు సరదాగా గడిపిన తర్వాత సముద్రస్నానాలు చేసేందుకు కొంతమంది విద్యార్థులు వెళ్లారు. కెరటం ధాటికి సురేంద్ర వర్మ కెరటాల్లో పడి గల్లంతయ్యాడు. వెంటనే విద్యార్థులు, పోలీసులకు తెలియజేయడంతో మత్స్యకారులు తమ అలివి వలతో అతడిని ఒడ్డుకు తీసుకొచ్చి గొడారిగుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి మరణవార్త తెలియడంతో భట్రవిల్లిలో ఉంటున్న తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తిమ్మాపురం ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

జనసేన టీషర్టులు పంపిణీ

మామిడికుదురు, ఏప్రిల్ 27: పాశర్లపూడిలంకలో జనసేనపార్టీగ్రామశాఖ అధ్యక్షుడు తెలగారెడ్డి బులినాగేశ్వరరావు సమకూర్చిన జనసేన టీషర్టులను జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పి.వివేక్‌బాబు అందించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని, కూటమి అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని కోరారు. అబేద్‌ఆలీ, ఇంజేటి రవి, బొరుసు బాబి, వై.రాజు, తెలగారెడ్డి లక్ష్మీనారాయణనాయుడు, మంచాల వేణు, అడ్డాల అయ్యప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గాలింకి రాజీనామా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 27: న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు గాలింకి చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేశారు. రాజీనామ పత్రాన్ని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు పంపినట్లు ఆయన తెలిపారు. రామచంద్రపురం అసెంబ్లీ టిక్కెట్ కేటాయింపుపై తీవ్ర మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయం కోసం పూజలు



అమలాపురం రూరల్, ఏప్రిల్ 27: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని కూటమి అభ్యర్థుల విజయం కోసం బండారులంక శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఘన విజయం సాధించాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ శ్రీశైలం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో నారికేళ పూజలు నిర్వహించారు. సర్పంచ్ పెనుమాల సునీత-ఏడుకొండలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, ఉందుర్తి జీవరత్నం, కొండా సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్మూలన చర్యలు చేపట్టాలని నిరసన

రాయవరం, ఏప్రిల్ 27: చెల్లూరు పంచాయతీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పది రోజుల నుంచి పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో పలు వీధులతో పాటు ఇళ్ల వద్ద చెత్త పేరుకుపోయిందని శనివారం టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో ఇళ్ల వద్ద పేరుకుపోయిన చెత్త బస్తాలతో పంచాయతీ కార్యాలయం ఎదుట చెల్లూరు గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు చెల్లూరు అక్కడకు చేరుకుని పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నేత తలాటం వెంకటేష్, 8వవార్డు మెంబరు చుండ్రు వీర్రాజు, పసల ప్రసాద్, మురకొండ విజయదుర్గారావు, మనీష్, మోరంపూడి పండుకుమార్ పాల్గొన్నారు.

3,600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

రావులపాలెం, ఏప్రిల్27: గోపాలపురం వ్యవసాయ చెక్‌పోస్టు వద్ద శనివారం బిల్లులు లేకుండా ఐషర్‌వ్యాన్‌లో తరలిస్తున్న 3,600కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్టు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు, దోపిడీ







కపిలేశ్వరపురం: అంగరలో ఎమ్మెల్యే వేగుళ్లకు హారతులిస్తున్న మహిళలు, పడమరఖండ్రికలో ప్రచార రథంపై మాట్లాడుతున్న లీలాకృష్ణ, మండపేటలో ఎమ్మెల్యే కుమార్తెల ప్రచారం

మండపేట కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు





మండపేటలో వేగుళ్ల కోసం ప్రచారం చేస్తున్న కుమార్‌బాబు, కపిలేశ్వరపురం మండలంలో ప్రచారం చేస్తున్న వేగుళ్ల, హరీష్‌మాధుర్

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 27: ప్రజల ఉత్సాహం చూస్తుంటే ఇది ఎన్నికల ప్రచార సభలా లేదని, విజయోత్సవ సభలా కనిపిస్తోందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం అంగర, పడమరఖండ్రిక, తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లో జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువత ఉత్సాహంగా బైక్‌ర్యాలీగా ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ వెంట ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పూలమాలలతో శాలువాలు కప్పి స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడే తన్ని తరిమేద్దామన్న భావనతో ప్రతీఒక్కరూ ముందుకు వస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలు, దోపిడీలతో ఐదేళ్ల వైసీపీ పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వృద్ధులకు రూ.4వేలు పింఛన్ అందిస్తామన్నారు. ఎస్సీ, బీసీ, ఓసీ మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా రద్దుచేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రద్దు చేసిన పథకాలను తిరిగి కొనసాగిస్తామన్నారు. ప్రశాంతంగా ఉండే మండపేట నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట కులాలను రెచ్చగొడుతూ వారి మధ్య చిచ్చు పెడుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన ఇన్‌చార్జ్ లీలాకృష్ణ ఆరోపించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థిగా గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వేగుళ్ల ఓటర్లను కోరారు. తొలుత ఆయన పడమరఖండ్రికలో గణపతి ఆలయాన్ని, అంగరలో అశిరాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల పార్టీ శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేగుళ్ల కుమార్తెల ప్రచారం

మండపేట,ఏప్రిల్27: కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ విజయం కోరుతూ ఎమ్మెల్యే వేగుళ్ల కుటుంబ సభ్యులు పట్టణంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల కుమార్తెలు మణిమంజరి, సాయి సుమన, వేగుళ్ల సోదరుడి కుమార్తె ముత్యాల మణిమంజరి, సోదరుడి కోడలు లక్ష్మీశిల్ప, వేగుళ్ల అల్లుడు వల్లూరి సాయి కుమార్ బాబు, సోదరుడి కుమారుడు వేగుళ్ల అజయ్‌బాబు, వల్లూరి రామన్నచౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ నాలుగు బృందాలుగా పట్టణంలోని వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ ఎన్నికలు ప్రచారం చేశారు. వేగుళ్ల కుమార్తెలు మహిళలకు బొట్టు పెడుతూ ఓట్లు అభ్యర్థించారు. శిరోముండనం కేసులో ముద్దాయిగా శిక్షపడిన తోటకు ప్రజలు ఓటనే వజ్రాయుధం ద్వారా బుద్ధి చెప్పాల న్నారు. ఆయన ఎక్కడి నుంచి వచ్చాడో అక్కడికే పంపిం చాలన్నారు. ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.